సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



ఎన్నికల్లో ఎన్ని వింతలో..

సాగునీటి సంఘాల ఎన్నికల్లో కొందరి ఇష్టా రాజ్యం సాగుతోంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇలాకా.. పిఠాపురంలో జరుగుతున్న ఈ తంతుపై రైతులు మండిపడుతున్నారు.


8 లో



పురుగు మందు తాగి వ్యక్తి మృతి

సకాలంలో వైద్యం అందక పురుగు మందు తాగిన వ్యక్తి మృతి చెందాడంటూ గోకవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట బంధువులు ఆందోళన చేపట్టారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 4,500, సెంట్రల్ 1,500, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి జలాలను వదిలారు. సముద్రంలోకి 6,384 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

ఢిల్లీ, ముంబైకి ఎయిర్‌బస్‌లు అభినందనీయం



రన్‌వేపై నీటిని వెదజల్లి ఢిల్లీ విమానానికి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

మధురపూడి: రాజమహేంద్రవరం నుంచి దేశ రాజధాని ఢిల్లీకి, ఆర్థిక రాజధాని ముంబైకి ఎయిర్‌బస్‌లు నిర్వహించడం అభినందనీయని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మధురపూడిలోని విమానాశ్రయం నుంచి ఢిల్లీకి 6ఈ364 ఇండిగో విమాన సర్వీసును కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు గురువారం ప్రారంభించారు. విమానయాన శాఖ నిబంధనల ప్రకారం నీటిని వెదజల్లి ఈ విమానానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ, రానున్న గోదావరి పుష్కరాల యాత్రికులకు ఢిల్లీ, ముంబై విమాన సర్వీసులు ఉపయోగపడతాయని అన్నారు. పుణ్యక్షేత్రాలైన తిరుపతి, వారణాసి, షిర్డీలకు ఎయిర్ కనెక్టివిటీ కల్పించాలని కోరారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, కాకినాడలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు స్థల సేకరణ జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర రావు, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జ్యోతుల నెహ్రూ, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, బీజేపీ నాయకుడు నీరుకొండ వీరన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.

210 కిలోల గంజాయి పట్టివేత



నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్ చెరువు వద్ద 210 కిలోల గంజాయిని బొమ్మూరు పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కారులో గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు బొమ్మూరు ఎస్సై ఎస్పీ కుమార్ తన సిబ్బందితో కలిసి దివాన్ చెరువులో కాపు కాశారు. అక్కడ ఆ కారును అడ్డుకుని సోదా చేశారు. దానిలో బస్తాల్లో కట్టిన 210 కిలోల గంజాయిని సీజ్ చేసి, నలుగురిని అరెస్టు చేశారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.6 లక్షలు ఉంటుందని అంచనా.

జాతీయ స్థాయి వర్క్‌షాప్‌కు ఎంపిక



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక నాగరాజా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని మోటూరి మంగారాణికి అరుదైన అవకాశం లభించింది. 'ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించడానికి పెడగోగికల్ లీడర్‌షిప్' అనే అంశంపై నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్‌షిప్ (ఎన్ఎస్ఎల్, న్యూపా) ఢిల్లీలో కంటెంట్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. దీనికి మంగారాణి ఎంపికయ్యారు. మన రాష్ట్రం నుంచి ఆమె ఒక్కరే ఎంపికవడంపై జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు హర్షం వ్యక్తం చేశారు. ఎంపిక ఉత్తర్వులను మంగారాణికి గురువారం అందజేశారు. ఈ వర్క్‌షాప్ ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకూ ఢిల్లీలోని ఎన్ఎస్‌సీఎల్‌లో జరుగుతుందన్నారు. మంగారాణిని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, అర్బన్ ఎంఈఓ-2 రమారజని అభినందించారు.

దగా పడిన అన్నదాత



నిడదవోలులో వర్షాలకు తడిసిన ధాన్యం ఆరబెడుతున్న రైతు (ఫైల్)

- కూటమి పాలనలో రైతన్నకు తప్పని ఇక్కట్లు
- పత్తా లేని ఉచిత పంటల బీమా
- అడ్రస్ లేని 'అన్నదాతా సుఖీభవ'
- ఆర్‌బీకేలు నిర్వీర్యం
- ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలతో సతమతం
- పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం కరవు
- 'అన్నదాతకు అండగా' వైఎస్సార్ సీపీ పోరుబాట
- నేడు రాజమహేంద్రవరంలో ర్యాలీ
- కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు చేకూరిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా	1,33,502	584.64
ఇన్‌పుట్ సబ్సిడీ	52,182	63.97
ఉచిత పంటల బీమా	67,513	102.38
పంట రుణాలు	27,183	5.01
రైతు భరోసా కేంద్రాల నిర్మాణం	279	52.31

సాక్షి, రాజమహేంద్రవరం: ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుంటూ.. బంగారు పంటలు పండించే అన్నదాతలు కూటమి పాలనలో అడుగడుగునా దగా పడుతున్నారు. అధికారంలోకి వస్తే అన్నదాతల సంక్షేమానికి కృషి చేస్తామని ఎన్నికల సమయంలో హామీలు గుప్పించిన కూటమి నేతలు.. గద్దెనెక్కిన అనంతరం ఆరు నెలలుగా వారి సంక్షేమాన్ని విస్మరించారు. 'అన్నదాతా సుఖీభవ' పేరిట పంట సాగుకు పెట్టుబడి సాయం చేస్తామన్న హామీ ఆచరణకు నోచుకోలేదు. ఉచిత పంటల బీమా, పంట నష్ట పరిహారానికి మంగళం పాడారు. రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో దళారులు చొరబడి దగా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. వెరసి పండించిన పంటలకు గిట్టుబాటు ధర దక్కక.. దక్కిన ధరకే తెగనమ్ముకోవాల్సిన దుస్థితి తలెత్తిందని రైతులు వాపోతున్నారు.



నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో మొలకెత్తిన ధాన్యపు గింజలు చూపుతున్న రైతు (ఫైల్)

'అన్నదాతా సుఖీభవ' ఊసే లేదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 'అన్నదాతా సుఖీభవ' పథకం కింద ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు, ఇతర నేతలు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తయినా నేటికీ వారికి నయా పైసా అందిన దాఖలాలు లేవు. ఇటీవలి బడ్జెట్‌లో సైతం అవసరమైన మేర కేటాయింపులు చేయలేదు. వెరసి సాగు పెట్టుబడి అందక రైతులు నానా పాట్లూ పడుతున్నారు.

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా సాగు ప్రారంభంలోనే జిల్లాలోని 1.22 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.90.55 కోట్ల మేర పెట్టుబడి సాయం జమ అయ్యేది. సున్నా వడ్డీలో భాగంగా 23,999 మంది రైతులకు రూ.5.50 కోట్ల వడ్డీ రాయితీ అందేది.

నామమాత్రంగా మారిన ఆర్‌బీకేలు

రైతులకు వ్యవసాయ సలహాలు, సూచనలతో పాటు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 373 రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో దళారుల ప్రమేయం లేకుండానే రైతులకు ఎరువులు, పురుగు మందులు, అవసరమైన విత్తనాలు అందేవి. అన్నదాతకు ఎంతో మేలు చేసిన ఈ వ్యవస్థపై కూటమి ప్రభుత్వం కక్ష గట్టింది. వీటి పేరు రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాల సరఫరాను ఎత్తివేసి, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు (పీఏసీఎస్) కట్టబెట్టింది. ఈ పరిణామం రైతుల్లో ఆందోళన నింపుతోంది.

ఉచిత పంటల బీమాకు మంగళం

ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బ తిన్న రైతులు నష్టపోకుండా పరిహారం అందించడంలో కీలక భూమిక పోషించే 'ఉచిత పంటల బీమా'కు కూటమి సర్కారు మంగళం పాడింది. బీమా ప్రీమియం చెల్లింపు భారాన్ని రైతుల పైనే మోపింది. జిల్లా వ్యాప్తంగా ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో సుమారు 83,068 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగవుతాయి. వరి పంట హెక్టారుకు రూ.1.05 లక్షలుగా విలువ నిర్ధారించి రైతు వాటాగా 1.50 శాతం అంటే రూ.1,575 ప్రీమియం చెల్లించాల్సి ఉంది. మినుములు, పెసలు హెక్టారుకు హెక్టారుకు రూ.750, జీడితోటలకు హెక్టారుకు రూ.3,750 చొప్పున ప్రీమియం కట్టాల్సి ఉంది. గత వైఎస్సార్ సీపీ హయాంలో ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించేది. తద్వారా రైతులపై దమ్మిడీ భారం కూడా పడేది కాదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ భారాన్ని రైతుల నెత్తిన రుద్దింది.

ధాన్యం కొనుగోళ్లలో విఫలం

ధాన్యం కొనుగోళ్లలో కూడా కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. నామ్ కే వాస్తే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందే తప్ప.. ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించలేదు. దీంతో తామెక్కడ నష్టపోతామోననే భయాందోళనతో రైతులు.. గత్యంతరం లేక తక్కువ ధరకే దళారులకు విక్రయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. బస్తా వరి ధాన్యానికి రూ.1,725 ప్రభుత్వ మద్దతు ధర అందాల్సి ఉండగా.. రూ.100 నుంచి రూ.200 వరకూ తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు నష్టపోకుండా.. ప్రతి గింజనూ ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేసింది. గత ఏడాది డిసెంబర్‌లో మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా 15,615 మంది రైతులకు సంబంధించి 10,487.02 హెక్టార్లలో ఉద్యాన, వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి. నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.14.80 కోట్ల పెట్టుబడి రాయితీని బాధిత రైతులకు మంజూరు చేసింది.



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చాగల్లులో రైతుల వద్దనే నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్న అధికారులు

జయప్రదం చేయండి



రైతులను దగా చేస్తున్న కూటమి సర్కార్‌పై నిరసన గళం విప్పుతున్నాం. ప్రభుత్వం కళ్లు తెరిచేలా భారీ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాం. అన్నదాతలకు అండగా వైఎస్సార్ సీపీ చేపడుతున్న కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ఈ కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలి. బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహిస్తాం. అక్కడ ప్రభుత్వ విధానాలను ఎండగడతాం. రైతుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తాం.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి

నేడు వైఎస్సార్ సీపీ ఆందోళన

కూటమి పాలనలో దగా పడుతున్న రైతన్నలకు అండగా ఉండేందుకు, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు వైఎస్సార్ సీపీ ఉద్యమ బాట పట్టింది. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, రైతులకు న్యాయం చేసే లక్ష్యంతో కలెక్టరేట్ల వద్ద శుక్రవారం ఆందోళనలు నిర్వహించాలని శ్రేణులకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పటికే పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లాలోని వైఎస్సార్ సీపీ నేతలు, రైతులు సంయుక్తంగా రాజమహేంద్రవరంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా నిర్వహిస్తారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేయనున్నారు.

ఇవీ డిమాండ్లు

- రైతుకు తక్షణం రూ.20 వేల పెట్టుబడి సాయం ఇవ్వాలి.
- సూపర్-6 హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి.
- ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలి. దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేయాలి.
- తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.
- తేమ లెక్కలతో రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలి.
- ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలి. రైతులపై అదనపు భారం మోపే చర్యలు మానుకోవాలి.

సూపర్-6 ఊసు ఏదీ!

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్-6 పథకాలు అమలు చేస్తామంటూ ఎన్నికల సమయంలో ప్రకటించిన కూటమి నేతలు.. అధికారం చేపట్టాక వాటి అమలును అటకెక్కించారు. ఆరు నెలల పాలనలో ఒకే ఒక్క పథకం ఉచిత గ్యాస్ సిలిండర్లు అమలు చేయగా.. అది కూడా కొన్ని సిలిండర్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొన్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మిగిలిన ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం, తల్లికి వందనం కింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏటా రూ.15 వేల చెల్లింపు, నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేల భృతి, మహిళలకు ప్రతి నెలా రూ.1,500 చెల్లింపు, 19 నుంచి 59 సంవత్సరాల వయస్సు మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం హామీల ఊసే ఇంతవరకూ తేవడం లేదు. తమను నమ్మించి ఓట్లు వేయించుకున్న కూటమి నేతలు నేటి వరకూ ఈ హామీల అమలుకు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

వేతన వేదన

- 12 రోజులైనా జీతాల్లేవ్
- నన్నయ వర్సిటీ సిబ్బంది ఇక్కట్లు
- రాష్ట్రంలోని ఇతర వర్సిటీల్లోనూ ఇదే పరిస్థితి



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ముఖద్వారం

రాజానగరం: ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తామంటూ గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం.. ఆ మాటను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని ప్రభుత్వోద్యోగులు విమర్శిస్తున్నారు. మిగిలిన ప్రభుత్వ శాఖల సంగతి ఎలా ఉన్నా విశ్వవిద్యాలయాల్లోని ఉద్యోగులకు ఈ నెలలో 12 రోజులు గడిచినా ఇప్పటి వరకూ ప్రభుత్వం జీతాలు చెల్లించలేదు. దీంతో వారందరూ జీతాలు ఎప్పుడొస్తాయోనని ఉసూరుమంటున్నారు.

ఏ ఉద్యోగి అయినా ఒకటో తేదీన జీతం అందుకోవాలనే చూస్తారు. దీనికోసమే నెలంతా పై అధికారులు చెప్పిన విధంగా విధులు నిర్వర్తిస్తుంటారు. ఒకటో తేదీన వచ్చే జీతానికి అనుగుణంగానే తన కుటుంబపు నెలవారీ బడ్జెట్ కేటాయింపులు చేసుకుంటారు. అయితే ఆ జీతం అందడం కాస్త ఆలస్యమైతే వారికి ఆర్థికంగా ఇక్కట్లు తప్పవు. ప్రస్తుతం ఇదే పరిస్థితులను ఎదుర్కొంటున్నారు ఆదికవి నన్నయ యూనివర్సిటీలో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది. వర్సిటీ క్యాంపస్‌తో పాటు కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో సుమారు 400 మంది వరకూ ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరికి ప్రతి నెలా వేతనాలుగా సుమారు రూ.1.45 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెలకు సంబంధించిన జీతాలు 12వ తేదీ వచ్చినా ఇప్పటి వరకూ చెల్లించలేదు. దీంతో, దిగువ స్థాయి ఉద్యోగులు ఆర్థికంగా నలిగిపోతున్నారు. జీతాలు రాకపోవడంతో ఇంటి అద్దె, పాల బిల్లు, నిత్యావసర వస్తువుల కొనుగోలు ఇలా.. తమ కుటుంబ, దైనందిన అవసరాలు ఏవిధంగా తీర్చుకోవాల్లో తెలియక సతమతమవుతున్నారు.

ఆలస్యం వాస్తవమే..



ఈ నెల జీతాల చెల్లింపులో కాస్త ఆలస్యం జరిగిన మాట వాస్తవమే. ఇది ఒక్క 'నన్నయ'లోనే కాదు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోనూ ఈ పరిస్థితి ఉంది. కొద్ది రోజుల్లోనే అందరికీ జీతాల చెల్లింపు జరుగుతుంది.

– ఆచార్య జి.సుధాకర్, రిజిస్ట్రార్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ

నిధుల మళ్లింపే కారణమా?

వర్సిటీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకూ ఉద్యోగులు ప్రతి నెలా మొదటి వారంలోనే ఠంచనుగా వేతనాలు అందుకుంటున్నారు. అటువంటిది ఈ నెలలో ఇప్పటి వరకూ జీతాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. బయటి వారిని చేబదులు అడగలేక, కుటుంబ అవసరాలు తీర్చుకోలేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. 'నన్నయ'తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న మిగిలిన 25 యూనివర్సిటీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనడంపై సిబ్బందిలో రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగులకు చెల్లించే జీతాల నిధులను కూటమి పాలకులు మళ్లించారనే ప్రచారం ఎక్కువగా జరుగుతోంది. సత్వరమే తమ జీతాలు చెల్లించి, కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడకుండా చూడాలని ఉన్నతాధికారులను వర్సిటీ సిబ్బంది వేడుకుంటున్నారు.

'అన్నదాతకు అండగా' తరలిరండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేణు, జక్కంపూడి రాజా, డాక్టర్ గూడూరి తదితరులు

- నేటి ఉదయం 9.30 గంటలకు ర్యాలీ
- వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ నిర్వహణ
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు
- 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో అగచాట్లు పడుతున్న అన్నదాతలకు అండగా నిలిచి, ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం నిర్వహించనున్న 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' కార్యక్రమం పోస్టర్‌ను ఆ పార్టీ యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఇతర నాయకులతో కలసి ఆయన గురువారం ఆవిష్కరించారు. బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమంలో వేణు మాట్లాడుతూ, తమ అధినేత జగన్ ఆదేశాల మేరకు శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9:30 గంటలకు బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి రైతులు, పార్టీ శ్రేణులు, ప్రజలతో ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుంటామని చెప్పారు. అనంతరం రైతుల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామన్నారు. కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం, అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల నుంచి రైతులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. దళారుల దోపిడీ నుంచి రైతులను ఆదుకోవాలని, ధాన్యం గిట్టుబాటు ధరను రూ.1,750కి పెంచాలని, తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం అశ్రద్ధ చూపుతోందని, తేమ శాతం పేరిట రైతులను దళారులు దగా చేస్తున్నారని మాజీ మంత్రి వేణు వివరించారు. ప్రధానంగా పెట్టుబడి కోసం రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా ద్వారా రైతులకు ఆర్థిక సాయం అందిస్తే, కూటమి నేతలు రూ.20 వేలు ఇస్తామన్నారని, నేటికీ అది అమలు కాలేదని చెప్పారు. రైతు సంక్షేమం కోసం గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుని వచ్చిన సంస్కరణలను కూటమి ప్రభుత్వం కొనసాగించాలని వేణు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, పార్టీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు (బాబు), మాజీ సొసైటీ అధ్యక్షులు బొప్పన సుబ్బారావు, ఆచంట కల్యాణ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి యెనుముల త్యాగరాజు, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ముద్దాల అను తదితరులు పాల్గొన్నారు.

మెట్లోత్సవంపై గందరగోళం

- 16న జరపాలన్న అన్నవరం దేవస్థానం పంచాంగం
- 15నే నిర్వహించేందుకు అధికారుల ఏర్పాట్లు

అన్నవరం : ఏటా ధనుర్మాస ఉత్సవాల ప్రారంభానికి ముందు రోజు సత్యదేవుని మెట్లోత్సవం నిర్వహిస్తుంటారు. అయితే, ఈసారి ఈ ఉత్సవం నిర్వహణపై కొంత గందరగోళం నెలకొంది. అన్నవరం దేవస్థానం పంచాంగంలో ఈ నెల 16వ తేదీ సోమవారం మెట్లోత్సవం, ధనుర్మాస ఉత్సవాల ప్రారంభం అని ఉంది. అయితే మెట్లోత్సవాన్ని ఈ నెల 15వ తేదీ ఆదివారమే నిర్వహించనున్నట్లు అన్నవరం దేవస్థానం అధికారులు తెలిపారు. దీంతో ఏ తేదీ సరైనదనే అంశంపై దేవస్థానంలో చర్చ జరుగుతోంది. దేవస్థానం పంచాంగాన్ని తంగిరాల ప్రభాకర పూర్ణయ్య సిద్ధాంతి రూపొందించారు. ఆయనకు తంగిరాల వేంకట కృష్ణ పూర్ణ ప్రసాద్ సహకరించారని ఆ పంచాంగంలో పేర్కొన్నారు. వాస్తవానికి ఈ పంచాంగం రాతప్రతిని ప్రతి ఉగాదికి మూడు నెలల ముందుగానే పంచాంగకర్తలు దేవస్థానం పండితులకు అందజేస్తారు. దానిని దేవస్థానం వైదిక కమిటీ పరిష్కరించి, తప్పులను సవరించి తిరిగి పంచాంగకర్తలకు పంపిస్తారు. అనంతరం దానిని ముద్రించి, ఉగాది నాడు దేవస్థానంలో పూజలు చేసి, పంపిణీ చేస్తారు. అయితే పంచాంగకర్తల గణన లోపమో లేక దేవస్థానం పండితులు సరిగా పరిశీలించకపోవడమో కానీ మెట్లోత్సవానికి పంచాంగంలో పేర్కొన్నది ఒక తేదీ అయితే దేవస్థానం నిర్వహిస్తున్నది మరో తేదీగా ఉంది.



ముస్తాబవుతున్న మెట్లు

చురుకుగా ఏర్పాట్లు

మెట్లోత్సవం సందర్భంగా రత్నగిరి దిగువన తొలి పావంచా నుంచి కొండ మీద సత్యదేవుని ఆలయం వరకూ ఉన్న 450 మెట్లకు భక్తులతో పూజలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే ప్రారంభించారు. రత్నగిరి మెట్ల మార్గంలో ప్రతి మెట్టునూ రంగులు వేసి, ముస్తాబు చేశారు. తొలి పావంచా వద్ద ఉన్న సత్యదేవుని పాదాల మండపం వద్ద ప్రత్యేకంగా అలంకరించనున్నారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. తొలుత రత్నగిరి నుంచి కొండ దిగువకు సత్యదేవుడు, అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకు వచ్చి, గ్రామంలో పల్లకీలో ఊరేగిస్తారు. అనంతరం తొలి పావంచా వద్ద స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తారు. తరువాత తొలి పావంచా వద్ద పూజలు చేసి, మెట్లోత్సవాన్ని ప్రారంభిస్తారు. అక్కడి నుంచి స్వామివారి ఆలయం వరకూ ఉన్న మెట్లకు భక్తులు పూజలు చేసి, హారతి ఇస్తారు. ఆ మెట్ల మీద నుంచి స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్తారు. ఇదిలా ఉండగా ధనుర్మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సోమవారం నుంచి సంక్రాంతి వరకూ అంటే జనవరి 14వ తేదీ వరకూ సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ అమ్మవారిని ప్రతి రోజూ ఉదయం ఏడు గంటల నుంచి అన్నవరం వీధుల్లో పల్లకీ మీద ఘనంగా ఊరేగిస్తారు.

క్లుప్తంగా

హాస్టల్‌లో మందుబాబుల దోపిడీ



నిందితులను చూపి వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్

పిఠాపురం: స్థానిక సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్‌లో 9వ తేదీ అర్ధరాత్రి విద్యార్థులను బెదిరించి దోపిడీకి పాల్పడిన ఇద్దరిని గురువారం అరెస్ట్ చేసినట్లు పిఠాపురం పట్టణ సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్థానిక రథాలపేటకు చెందిన పూడి గంగాధర్ (బాలు), అతని స్నేహితుడు, కుమారపురం గ్రామానికి చెందిన గుబ్బల దయానంద (పాలు) మద్యం తాగి డబ్బుల కోసం పిఠాపురంలోని సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్‌లోకి గోడ దూకి లోపలకు ప్రవేశించారు. హాస్టల్‌లో నిద్రిస్తున్న 8, 9, 10 తరగతి విద్యార్థులు ఉండే గదుల్లోకి వెళ్లి వారిని భయభ్రాంతులకు గురిచేశారు. బీరు బాటిళ్లు పగలగొట్టి దానితో పొడిచి చంపుతానని బెదిరించారు. పిల్లల వద్ద ఉన్న డబ్బులు పూర్తిగా ఇవ్వాలని, లేకపోతే చంపుతామంటూ బెదిరించి సుమారు రూ.540 బలవంతంగా వసూలు చేసి పరారయ్యారు. ఈ సంఘటనపై హాస్టల్ వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. గురువారం నిందితులను అరెస్టు చేసి పిఠాపురం కోర్టులో హాజరు పరిచామని సీఐ వివరించారు.

ఎన్నికల్లో ఎన్ని వింతలో..

- నీటి సంఘాల ఎన్నికల్లో ఇష్టారాజ్యం
- ఉప ముఖ్యమంత్రి ఇలాకాలో అస్తవ్యస్తంగా విభజన
- పిఠాపురం ఏలేరు ఆయకట్టులో 400 మంది ఓట్లు గల్లంతు
- ఏలేరుతో సంబంధం లేనివారికి ప్రాధాన్యం
- ఆధిపత్యానికి చక్రం తిప్పుతున్న టీడీపీ నేత



ఏలేరు కాలువ

పిఠాపురం: సాగునీటి సంఘాలకు రెండు అంచెల్లో ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 14న సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను, 17న డిస్ట్రిబ్యూషన్ కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే నీటి సంఘాల ఎన్నికల్లో కొందరి ఇష్టారాజ్యం సాగుతోంది.. ఈ ఎన్నికల్లో అర్హులకు ఎగనామం పెట్టి తమకు అనుకూలమైన రైతులకు పదవులు కట్టబెట్టేందుకు ప్రయత్నం జరుగుతోంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇలాకాలో జరుగుతున్న ఈ తంతుపై రైతాంగం మండిపడుతోంది. ఏలేరు పరివాహక ప్రాంతాల్లో అత్యంత కీలకమైన పిఠాపురం నియోజకవర్గంలో నీటి సంఘాల విభజన, విలీనాలపై అభ్యంతరాలు వ్యక్తమైనా జరిగేది జరిగిపోతోంది. శాస్త్రీయత లేని విభజనతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు చెబుతున్నా.. రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించినా జిల్లా అధికారులు పట్టించుకోక పోవడంతో వందల మంది రైతులు తమ ఓటుతో పాటు సాగునీటి సరఫరాపై హక్కులను కోల్పోతున్నారు. నియోజకవర్గంలో కొన్ని గ్రామాలను సంఘాల్లో చేర్చకపోవడం, సంబంధం లేని డీసీల్లో విలీనం చేయడం పిఠాపురం నియోజకవర్గ ఏలేరు రైతాంగానికి తీరని నష్టంగా మారింది. నీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో నీటి పారుదల శాఖ చేపట్టిన ప్రాదేశిక నియోజకవర్గాల విభజన రైతులను నట్టేట ముంచేలా ఉందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

అటు ఇటు మార్పులు..

ఏలేరు ఆయకట్టుపై జగ్గంపేట, ఏలేశ్వరం, పిఠాపురం, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, కిర్లంపూడి, పెద్దాపురం మండలాల్లో వ్యవసాయం జరుగుతోంది. ఏలేరు ప్రాజెక్టుపై 2003 నుంచి ఇప్పటి వరకూ ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు జరిగేవి. తాజాగా ఏలేరు ఆధునీకరణకు భారీగా నిధులు విడుదల చేసే అవకాశం ఉండడంతో వాటిపై పెత్తనం చెలాయించడానికి మెట్ట ప్రాంత టీడీపీ నేత ప్రోద్బలంతో డీసీల సంఖ్యను ఆరుకు పెంచడంతో పాటు నీటి సంఘాలు 30కి పెంచడం, ఇష్టారాజ్యంగా మార్పులు చేశారు. దీనిపట్ల ఏలేరు ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం మండలం రాపర్తి, భోగాపురం, బి.ప్రత్తిపాడు నీటి సంఘాలు ముక్కొల్లు డీసీలో ఉండేవి. అధికారులు ఈ గ్రామాలను డీసీ నుంచి తొలగించారే తప్ప మరో డీసీలో కలపలేదు. దీనివల్ల ఈ గ్రామాల్లో సుమారు 400 మంది రైతులు తమ ఓటు హక్కును కోల్పోగా, వేలాది మంది నీటి పారుదలపై తమకు ఉన్న హక్కులను కోల్పోయారు. భవిష్యత్తులో నీటి సమస్యలు, కాలువ ఆధునీకరణకు సంబంధించి ఎవరిని అడగాలో తెలియని అయోమయ పరిస్థితిలోకి వెళ్లిపోయామని రైతులు వాపోతున్నారు. తమను ఓటరు జాబితాలో చేర్చలేదని ఆందోళన వ్యక్తం చేసినా అధికారులు పట్టించుకోలేదని అంటున్నారు. పిఠాపురం మండలం ఏలేరు ఆయకట్టుపై పి.దొంతమూరు, పి.రాయవరం కమిటీలు కిర్లంపూడి డీసీలో ఉండేవి. వాటిని ఆ డీసీ నుంచి తొలగించి ఎక్కడో దూరంగా ఉన్న ముక్కొల్లు, కిర్లంపూడి డీసీలో కలిపారు. పెద్దాపురం డీసీలో ఉండే మల్లాం, మంగితుర్తి గ్రామాలను అక్కడ తొలగించి గొల్లప్రోలులో కలపడంపై మల్లాం, జల్లూరు ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక కాలువపై సాగు చేసే గ్రామాల రైతులను ఒక కాలువపై కాకుండా వివిధ కాలువలకు గ్రామాలకు విభజించడం ఏంటని ప్రశ్నించినా ఎవరూ పట్టించుకోడం లేదని వాపోతున్నారు.

హైకోర్టు ఆదేశించినా..



నీటి సంఘాల అస్తవ్యస్త విభజనపై పిఠాపురం ఏలేరు ఆయకట్టు రైతులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. దీనిని విచారించిన హైకోర్టు నీటి సంఘాల విభజనపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అయినప్పటికీ ఏ ఒక్క అధికారి పట్టించుకోలేదు. తమకు ఓట్లు లేకుండా పోతున్నాయని మొరపెట్టుకోగా అధికారులు వచ్చి విచారణ చేసి వెళ్లి పోయారే తప్ప ఏ ఒక్కరికి ఓటు హక్కు కల్పించలేదు. ఒకపక్క రైతులు ఆందోళన చేస్తున్నా ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేస్తున్నారు. రైతులకు అన్యాయం చేస్తూ నీటి సంఘాల ఎన్నికలు జరుగుతుండడంపై ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టి సారించాలి.

– ఎం.శ్రీనివాసరెడ్డి, రైతు, రాపర్తి, పిఠాపురం మండలం

మా హక్కులు కాలరాశారు



పూర్వం నుంచి భూములు పండించుకుంటూ సాగునీటి హక్కును కలిగి ఉన్న మా గ్రామ రైతుల హక్కులను అధికారులు కాలరాశారు. వందల మంది రైతుల ఓటు హక్కును తీసేశారు. ప్రతి నిత్యం కాలువలపై తిరిగే మాకు హక్కు లేకుండా ఎక్కడో ఉన్న ముక్కొల్లు కాలువపై కమిటీలో కలిపారు. ఇలాంటి విభజన ఎప్పుడూ లేదు. ఎంత మొరపెట్టుకుంటున్నా అధికారులు పట్టించుకోడం లేదు. ఎవరికి చెప్పినా వినే నాథుడు లేడు. ఎవరి కోసం ఇదంతా చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ సాగునీటి సంఘాల ఎన్నికలు అంతా రైతులకు అన్యాయం చేయడానికే చేస్తున్నట్టు కనిపిస్తోంది.

– వీరపురెడ్డి వెంకటరమణ, రైతు, రాపర్తి, పిఠాపురం మండలం

నన్నయ వర్సిటీ ఆర్చరీ జట్టు ఎంపిక



ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తున్న ఆచార్య సుధాకర్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజియేట్ ఆర్చరీ (విలువిద్య) మెన్ అండ్ ఉమెన్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ గురువారం ప్రారంభమయ్యాయి. దీనికోసం నిర్వహించిన పోటీలను రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డు ఇన్‌చార్జి సెక్రటరీ ఆచార్య జి.సుధాకర్ ప్రారంభించారు. ఏకలవ్యుని మాదిరిగా ఏకాగ్రతతో లక్ష్యాలను సాధించాలని ఆయన అన్నారు. ఇండియన్ రౌండ్ ఆర్చరీ విధానంలో జరిగిన పోటీలకు అనుబంధ కళాశాలల నుంచి 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులను యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. పురుషుల విభాగంలో టి.అజయ్ (ఎస్‌కేవీటీ రాజమహేంద్రవరం), పి.కృష్ణ (సీబీఆర్, పిఠాపురం), యు.మహేష్‌బాబు, వి.వెంకటప్రసాద్ (జీడీసీ చింతలపూడి)లు ఉన్నారు. అలాగే మహిళా విభాగం నుంచి డి.మానస, జి, నవ్యమమత (ఏఎస్‌డీ కాలేజీ, కాకినాడ), జి.సావిత్రి, సీహెచ్ అంజలి (జీడీసీ చింతలపూడి) ఉన్నారు. వీరు ఈ నెల 22 నుంచి 26 వరకూ భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కె.సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీలు వి.సాల్మన్, దేవానంద్, అబ్జర్వర్ డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం, సెలక్షన్ కమిటీ సభ్యులు అలీ, విజయ్‌కుమార్, పీఈటీలు ఆర్.సాంబశివరావు, డాక్టర్ బి.రామ్‌గోపాల్, డాక్టర్ బాల సత్యనారాయణ, రిటైర్డ్ ఎంఈఓ జేఎస్ఎస్ గోపాలకృష్ణ, టి.లక్ష్మణ్, డాక్టర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

రాజానగరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి కొంతమూరులో జరిగిన హత్య కేసులో ఓ వ్యక్తికి జీవిత ఖైదుతోపాటు రూ. రెండు వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 5వ అదనపు సెషన్స్ జడ్జి డి.విజయ్‌గౌతమ్ గురువారం తీర్పు చెప్పారు. కొంతమూరుకు చెందిన తోట కనకదుర్గను 2020లో అయినశెట్టి నరసింహరాజు హతమార్చాడు. అతనిపై అప్పటి ఎస్సై ఐ.నాగబాబు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ ఎంవీ సుభాష్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి, ముద్దాయిని అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారని సీఐ వీరయ్యగౌడ్ తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

- సకాలంలో వైద్యం అందలేదని బంధువుల ఆరోపణ
- గోకవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన



డ్యూటీ డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు

గోకవరం: పురుగు మందు తాగిన వ్యక్తికి సకాలంలో వైద్యం అందక మృతి చెందాడంటూ గోకవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట బంధువులు ఆందోళన చేపట్టారు. ఆ వివరాల ప్రకారం.. గోకవరానికి చెందిన కాళ్ల రాజమల్లి (35) తాపీపని చేస్తూ జీవినం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో గురువారం తెల్లవారు జామున పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని హుటాహుటిన గోకవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన బంధువులు అతని మృతదేహంతో గోకవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. పురుగు మందు తాగిన రాజమల్లిని హుటాహుటిన గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తే డ్యూటీ డాక్టర్ గంట వరకూ పట్టించుకోలేదని ఆరోపించారు. తామే ఉప్పు నీళ్లు పట్టించామని, కనీసం చెయ్యి పట్టుకుని కూడా చూడలేదని వాపోయారు. గంట సేపు వైద్యం అందించకపోవడంతో మృత్యువాత పడ్డాడని, వైద్యం అందించి ఉంటే బతికేవాడన్నారు. ఈ విషయం తెలుసుకున్న గోకవరం ఎస్సై పవన్ కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. డ్యూటీ డాక్టర్‌పై చర్యలు తీసుకునే వరకూ ఆందోళన విరమించేది లేదని, అవసరమైతే జిల్లా కలెక్టర్ వద్దకు వెళతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఫోన్‌లో మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడగా తమకు న్యాయం చెయ్యాలని కోరారు. అనంతరం కోరుకొండ సీఐ సత్యకిశోర్ సమక్షంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వనజాకుమారి మృతుని బంధువులతో మాట్లాడుతూ ఘటనపై విచారణ నిర్వహించి బాధ్యులపై రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటామని తెలపడంతో ఆందోళన విరమించారు. ఇదిలా ఉండగా గత నెల 23న గోకవరం ఫారెస్ట్ ఠాణాలో ఠాణాదార్‌గా విధులు నిర్వహిస్తున్న బీరబోయిన వెంకటలక్ష్మి ప్రసవం సమయంలో వైద్యం వికటించి మృత్యువాత పడింది. దీంతో ఆసుపత్రిలో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదనే ఆరోపణలు ప్రజల వద్ద నుంచి వినిపిస్తున్నాయి.



రాజమల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

ఘటనపై డీసీహెచ్ఎస్ విచారణ

వైద్యం అందక వ్యక్తి మృతి చెందాడన్న ఆరోపణలపై రాజమహేంద్రవరం డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎన్.పద్మశ్రీరాణి విచారణ నిర్వహించారు. ఉదయం గోకవరం ప్రభుత్వాసుపత్రిలో విచారణ చేపట్టి ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వనజకుమారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు.

భీమేశ్వరుని హుండీ ఆదాయం రూ.56.01 లక్షలు



ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామివారి దేవస్థానంలో హుండీల ద్వారా రూ.56.01 లక్షల ఆదాయం సమకూరిందని దేవస్థాన సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని గురువారం తెలిపారు. సెప్టెంబర్ 26 నుంచి ఈ నెల 12 వరకూ 78 రోజులకు గాను బంగారం 94.100 గ్రాములు, వెండి 552 గ్రాములు, అన్నదాన హుండీల ద్వారా ఆదాయం రూ. 1,09,670 సమకూరిందని ఆమె వెల్లడించారు. ఆ శాఖ రామచంద్రపురం డివిజన్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ రాంప్రసాద్, అర్చక, సేవా సిబ్బంది పాల్గొన్నారు.

అణచివేత ఉన్నచోట తిరుగుబాటు ఉండాలి

జాతీయ పురస్కారాల ప్రదానోత్సవంలో 'వెన్నెల గద్దర్'



పి.గన్నవరంలో గద్దర్ జాతీయ పురస్కారాన్ని అందిస్తున్న వెన్నెల గద్దర్, ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: అణచివేత ఉన్నచోట తిరుగుబాటు ఉండాలని, అప్పుడే న్యాయం జరుగుతుందని ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న 110 మందికి మమత స్వచ్ఛంద సేవాసమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో గురువారం పి.గన్నవరం సాయితేజ విద్యాసంస్థల ప్రాంగణంలో గద్దర్ జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో వెన్నెల గద్దర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ ఆశయాలు, లక్ష్యాలను ముందే నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. ఎన్నో ఇబ్బందులు పడి 69 ఏళ్ల పాటు ఇక్కడి మహిళలు, ప్రజలు, పేదలకు విశేష సేవలు అందించిన మదర్‌థెరిసాను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. తన పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వనని, టీవీ చూపించనని, గద్దర్ పాటలు వినిపిస్తానని వెన్నెల వెల్లడించారు. తన తండ్రి గద్దర్ పేరున సేవా పురస్కారాలు అందించిన కోరుకొండ జాన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా స్ఫూర్తిదాయక కథలు, పాటలతో ఆమె అలరించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి మాట్లాడుతూ ఎక్కడ అన్యాయం జరిగినా గద్దర్ అక్కడికి వెళ్లి పోరాటం సాగించేవారన్నారు. అనంతరం వెన్నెలను సత్కరించారు. జెడ్పీ మాజీ ప్రతిపక్ష నేత సాకా ప్రసన్నకుమార్, అరిగెల బలరామ్మూర్తి, అన్నాబత్తుల అనుబాబు, ముదునూరి లతేంద్రవర్మ, దాసరి రత్నం, కె.చక్రవర్తి, నల్లా పెదకాపు, ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.